సాక్షి అనకాపల్లి

శనివారం । 8 । జూలై । 2023



లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

కశింకోట వద్ద లారీని ఢీకొని ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ప్రమాదంలో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. IIలో



అయోధ్య రాముని పాదుకలు

విశాఖ: అయోధ్య రామయ్య పాదుకలు శుక్రవారం నగరానికి చేరుకున్నాయి. పాత వెంకోజీపాలెం రామాలయంలో ప్రదర్శించారు.

స్వల్ప వర్షసూచన



అనకాపల్లి టౌన్: రాగల నాలుగు రోజులు స్వల్ప వర్ష సూచన ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి శుక్రవారం పేర్కొన్నారు. ఈనెల 8న 5 మి.మీ, 10న 8, 11న 6, 12న 10 మి.మీ.చొప్పున వర్షపాతం నమోదు కావచ్చని తెలిపారు. ఉష్ణోగ్రతలు 34 నుంచి 34.8 డిగ్రీలు ఉండవచ్చన్నారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ జయంతి వేడుకలు నేడు

అనకాపల్లి టౌన్: పూడిమడక జాతీయ రహదారిలో గల దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద శనివారం ఉదయం 8.30 గంటలకు మహానేత జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి ముఖ్య అతిథులుగా పాల్గొని నివాళులు అర్పిస్తారని చెప్పారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఏయూలో నేడు వైఎస్సార్ కాంస్య విగ్రహావిష్కరణ



ఏయూలో ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో శనివారం ఉదయం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంస్య విగ్రహావిష్కరణ జరగనుంది. మహానేత ఆకస్మిక మరణం తరువాత 2009 సెప్టెంబర్ 19న ఏయూలో వైఎస్ఆర్ ఫైబర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీని స్థానంలో కొత్త కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా ఈ కాంస్య విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

శాకంబరీదేవిగా దుర్గాలమ్మ




మాడుగుల రూరల్: ఎం.కోడూరు గ్రామంలో గల దుర్గాలమ్మ తల్లిని శుక్రవారం శాకంబరీదేవిగా అలంకరించారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజున దుర్గాలమ్మ కమిటీ ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయలతో అమ్మవారికి చేసిన అలంకారం భక్తులను పరవశులను చేసింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఏసీబీ కోర్టు న్యాయమూర్తిగా వెంకటరమణ

విశాఖ-లీగల్ : నగరంలోని రెండో అదనపు జిల్లా న్యాయమూర్తిగా కర్నూలు జిల్లా ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎం.వెంకటరమణ బదిలీపై వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎస్.శ్రీదేవి విశాఖలోని ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి కం ఎమ్మెస్సీ కోర్టుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు పరిపాలన వ్యవహారాల శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

చెరగని ప్రగతి సంతకం.. వైఎస్సార్





తాండవ నదిపై నిర్మించిన మినీ బ్యారేజీలు

అయన చూపులు... సుదీర్ఘ పరిచయపు చిరునవ్వును చిందిస్తూ, అందరి వైపూ ఆత్మీయంగా ప్రసరిస్తాయి.
అయన చేతులు... సదా ఏదో ఇవ్వడానికే తామున్నట్టు ఓ ఆత్మీయ స్పర్శో, చల్లని దీవెనో కురిపిస్తుంటాయి.
అయన పాదాలు.. ఆపన్నుల్ని ఆదుకునేందుకు, బడుగుల బతుక్కు కొత్త భరోసా ఇచ్చేందుకు నిరంతరం తపిస్తుంటాయి.
ఆయన తెలుగునాట గుండె కింద ఆరని తడి.. ఏళ్లు గడిచినా మరపురాని జ్ఞాపకాల జడి...

- మరపురాని మహానేత గురుతులు
- ఉమ్మడి విశాఖ జిల్లాకు రాజశేఖరుడి హయాంలో మహర్దశ
- విశాఖ సమగ్రాభివృద్ధికి ఆనాడే అడుగులు
- నాడు వైఎస్సార్ వేసిన అభివృద్ధి బాట.. నేడు పరిపాలనా రాజధానికి పూలబాట
- వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి నేడు

సాక్షి, విశాఖపట్నం : మహానేత వైఎస్సార్ మానస పుత్రికగా విశాఖ నగరం ఉజ్వలంగా వెలుగొందింది. ప్రతి రంగంలోనూ ప్రగతికి బాటలు వేసి.. పల్లె, పట్టణమని తేడా లేకుండా ఉమ్మడి విశాఖ జిల్లాలో అభివృద్ధికి నాంది పలికారాయన. లెక్కలేనన్ని ప్రతిపాదనలకు కార్యరూపమిచ్చారు. అభ్యున్నతికి ఆలంబనగా సాగిన వైఎస్సార్ పాలనలో విశాఖ.. సరికొత్తగా ఆవిష్కృతమైంది. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాల నిర్లక్ష్యంతో.. ప్రగతి గతి తప్పి.. విశాఖ వైభవానికి చెదలు పట్టాయి. ప్రజల ఆశలు నీరుగారిపోయాయి. ముఖ్యమంత్రిగా 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత.. విశాఖ నగరం విశ్వనగరంగా దూసుకుపోతోంది. త్వరలో పరిపాలనా రాజధాని కానుంది. శనివారం వైఎస్సార్ జయంతి సందర్భంగా రాజన్న చేపట్టిన అభివృద్ధి.. సంక్షేమాలను గుర్తు చేసుకుందాం.

గ్రేటర్ హోదా కల్పించి..

ఏళ్ల తరబడి వాయిదాలు పడిన మహా విశాఖ ప్రతిపాదనలు వైఎస్సార్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫలించాయి. విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు 2005 నవంబర్ 22న మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ)గా గ్రేటర్ హోదా కల్పించారు. అప్పటి వరకూ 111 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఉన్న విశాఖ 540 చ.కి.మీ విస్తీర్ణంతో మహా విశాఖగా అవతరించింది. 2013లో భీమిలి, అనకాపల్లి మున్సిపాలిటీలను విలీనం చేయగా ప్రస్తుతం 681.96 చ.కి.మీ.లకు విస్తరించింది. 72 వార్డులతో ఉన్న జీవీఎంసీని విస్తరిస్తూ 81 వార్డులు ఏర్పాటు చేస్తామంటూ టీడీపీ ప్రభుత్వం 2018 ఆగస్టు 16న జీవో నం.311 జారీ చేసింది. అప్పటి నుంచి గద్దె దిగే వరకూ కాలయాపన చేస్తూ వచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే.. జీవీఎంసీ వార్డుల విస్తరణపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టి సారించారు. మరో 10 పంచాయతీలను విలీనం చేస్తూ.. ప్రస్తుతం 98 వార్డులుగా మార్చారు.

దేశంలోని టాప్ నగరాల్లో ఒకటిగా..

దేశంలో జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం అమలైన 63 నగరాల్లో వైజాగ్‌ను చేర్చిన ఘనత వైఎస్సార్‌దే. జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ పునర్నిర్మాణ పథకం (జెఎన్ఎన్‌యూఆర్ఎం)లో విశాఖ నగరాన్ని చేర్పించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన చొరవతో నగరానికి రూ.1,885 కోట్ల విలువైన పనులు దక్కాయి. రాష్ట్ర ప్రభుత్వ వాటా 20 శాతం కూడా ఎప్పటికప్పుడు జీవీఎంసీకి అందజేసేలా చర్యలు తీసుకున్నారు. సింహాచలం, పెందుర్తి బీఆర్‌టీఎస్ కారిడార్లు, ఆశీల్‌మెట్ట ఫ్లైఓవర్, విలీన గ్రామాలకు తాగునీటి సౌకర్యంతోపాటు భూగర్భ మురుగు నీటి వ్యవస్థ, మౌలిక సదుపాయాల కల్పన మొదలైన 20 ప్రాజెక్టులను వైఎస్సార్ తీసుకొచ్చారు.

యువతకు ఉపాధి... భవితకు పునాది

2008 జనవరి 2వ తేదీన ఉపాధి పథకాన్ని వైఎస్సార్ ప్రారంభించారు. రూ.5 కోట్లను కేటాయిస్తూ 18-35 ఏళ్ల మధ్య వయసున్న యువతకు 13 అంశాల్లో శిక్షణ ఇచ్చి, ఆ శిక్షణ సంస్థల ద్వారానే 70 శాతం వరకూ ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. హౌస్ కీపింగ్, సెక్యూరిటీ గార్డ్స్, సర్ఫేస్ ఆర్నమెంట్స్.. మొదలైన అంశాల్లో శిక్షణ తీసుకొని ఉపాధి పొందిన వారెందరో ఉన్నారు. ఆయన మరణించిన తర్వాత ఈ పథకాన్ని పూర్తిగా విస్మరించేశారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన కొద్ది నెలలకే.. సచివాలయ వ్యవస్థను రూపొందించి 4 లక్షలకు పైగా ఉద్యోగాలను అందించారు.

అంతర్జాతీయ హోదా ఆయన ఘనతే...

హైదరాబాద్‌కే పరిమితమైన అంతర్జాతీయ విమానాశ్రయ సర్వీసులను విశాఖ ప్రజలకూ పరిచయం చెయ్యాలని వైఎస్సార్ సంకల్పించారు. అనుకున్నదే తడవుగా రూ.100 కోట్లు వెచ్చించి విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా తీసుకొచ్చారు. టీడీపీ హయాంలో విమానయాన సంస్థలకు అందించాల్సిన రాయితీలు చెల్లించకపోవడంతో అనేక సర్వీసులు నిలిచిపోయాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మళ్లీ సర్వీసులు మొదలయ్యాయి. ఇటీవల భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శంకుస్థాపన కూడా చేశారు.

ఏలేరు నీటిని తీసుకొచ్చింది రాజన్నే..

గోదావరి నీటిని విశాఖతోపాటు ఉత్తరాంధ్ర తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలు తీర్చాలన్న సంకల్పంతోనే పోలవరం ఎడమకాల్వను నిర్మించారు. తాండవ, రైవాడ, పెద్దేరు, కోనాం ప్రాజెక్టుల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. ఏలేరు నీటిని మళ్లించడం ద్వారా స్టీల్‌ప్లాంట్ పారిశ్రామిక అవసరాల కోసం నిత్యం తలెత్తే నీటి సమస్యను తీర్చారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. ఆ తర్వాత ఆ ప్రాజెక్టు కోసం ఆలోచన చేసిన నాథుడే లేకుండా పోయారు. ఇప్పుడు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సుజల స్రవంతి ప్రాజెక్టు పరుగులు పెడుతోంది.

కాఫీ ప్లాంటేషన్ ప్రాజెక్ట్...

విశాఖ ఏజెన్సీలో కాఫీ ప్లాంటేషన్ ప్రాజెక్టు తీసుకొచ్చింది కూడా వైఎస్ రాజశేఖర్‌రెడ్డే. ఆయన హయాంలో ఈ ప్లాంటేషన్‌కు రూ.144 కోట్లు కేటాయించారు. పాడేరు, అరకు ప్రాంతాల్లో సుమారు 60 వేల ఎకరాల కాఫీ ప్లాంటేషన్ ద్వారా దాదాపు 60 వేల మంది గిరిజనులకు ఉపాధి కల్పిస్తూ.. ఆర్థిక భరోసా ఇచ్చారు. అటవీ భూముల్లో పోడు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్న గిరిజనులకు అటవీ హక్కుల గుర్తింపు చట్టం ద్వారా 2009 జులై 12న హక్కు పత్రాల పంపిణీకి శ్రీకారం చుట్టారు.



విమ్స్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన మహానేత

వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రజలకు హైదరాబాద్ నిమ్స్ తరహాలో అత్యుత్తమ సేవలు అందించేందుకు విమ్స్‌కు 2006లో వైఎస్సార్ శ్రీకారం చుట్టారు. 1,130 పడకలు, 21 సూపర్ స్పెషాలిటీ బ్లాకులతో రూ.250 కోట్లతో విమ్స్ ఆస్పత్రికి 2007లో శంకుస్థాపన చేశారు. ఆయన మరణించాక విమ్స్‌ని పట్టించుకోలేదు. 2016 ఏప్రిల్‌లో విమ్స్ అందుబాటులోకి వచ్చింది. అంతా సవ్యంగా సాగుతున్న తరుణంలో చంద్రబాబు ప్రభుత్వం విమ్స్‌ని ప్రైవేట్‌పరం చేసేందుకు కుయుక్తులు పన్నింది. ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ఈ ప్రయత్నాన్ని అడ్డుకుంది. గతంలో కోవిడ్ సమయంలో విమ్స్‌ని స్టేట్ కోవిడ్ హాస్పిటల్‌గా మార్చింది. ప్రస్తుతం అటు విమ్స్, ఇటు కేజీహెచ్ రోగులకు అత్యుత్తమ సేవలందిస్తున్నాయి.


ముందుచూపుతో విశాఖ ఐటీకి జీవం



ఐటీ ప్రగతి ఒక్క హైదరాబాద్‌కే పరిమితం కాకుండా వికేంద్రీకరణ జరగాలని వైఎస్సార్ భావించారు. ముందు చూపుతో విశాఖను ఐటీ హబ్‌గా మార్చేందుకు ఆనాడే శ్రీకారం చుట్టారు. విశాఖలో మూడు కొండల్ని, కొండల కింద ఉన్న సుమారు 100 ఎకరాల పల్లపు ప్రాంతాన్ని ఎంపిక చేశారు. వైఎస్ ఆలోచనలను మెచ్చి సుమారు 200 కంపెనీలు ముందుకొచ్చాయి. ఇందులో కొద్ది కాలంలోనే 70 శాతం కంపెనీలు కార్యకలాపాల్ని ప్రారంభించాయి.
సత్యం, విప్రో కంపెనీలూ విశాఖలోనూ శాఖలను విస్తరించాయి. వైఎస్సార్ మరణం తర్వాత.. ఆయనతోపాటే ఐటీ గ్రాఫ్ కూడా కనుమరుగైపోయింది. ఎగుమతులు పడిపోయాయి. టీడీపీ హయాంలో ఒక్కొక్క కంపెనీ వెనక్కు వెళ్లిపోయాయి. దాదాపు పదేళ్ల విశాఖ ప్ర'గతి' తప్పింది. మళ్లీ 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నుంచి ఐటీ రంగం పరుగులు పెడుతోంది. విశాఖ నగరంలో ఇన్ఫోసిస్ కార్యకాలపాలకు సిద్ధమైంది. డేటా అదాని సెంటర్ శంకుస్థాపన జరిగింది. దీంతో విశాఖ ఐటీ కళ సంతరించుకుంది.

అన్నదాతల ఆత్మబంధువు

ఖరీఫ్, రబీలకు తాండవ నీరు అందించిన భగీరథుడు



దాదాపు పూర్తికావచ్చిన పోలవరం కాలువ

నక్కపల్లి: మహానేత వైఎస్సార్ జ్ఞాపకాలు రైతన్నల మదిలో పదిలంగా ఉంటాయి. తాండవ, వరాహ నదులపై మినీబ్యారేజీల నిర్మాణం ద్వారా దాదాపు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించారు. రూ.8 కోట్లతో మినీ బ్యారేజీలు నిర్మించి తాండవ జలాలు వృథా పోకుండా అడ్డుకట్ట వేశారు. 35 క్యూసెక్కుల తాండవ జలాలను పేట ప్రజలకు అందించారు.

ఖరీఫ్, రబీల్లో రెండు పంటలు పండించే రైతులకు సాగునీటి కష్టాలు తీర్చారు. పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి నీటిని పాయకరావుపేట వరకు తరలించేందుకు రూ.25 కోట్లు కేటాయించారు.

పోలవరం పరవళ్లు

ప్రజాప్రస్థానంలో భాగంగా ఈ ప్రాంతంలో పాదయాత్ర చేపట్టిన వైఎస్‌కు రైతులు పోలవరం ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పోలవరం పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో పోలవరం ఎడమ కాలువ కింద 6, 7, 8 ప్యాకేజీల్లో భాగంగా పాయకరావుపేట నుంచి యలమంచిలి వరకు కాలువలను 60 శాతం నిర్మించారు. కాలువలో చేరిన వర్షపు నీటితో పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో రైతులు ఖరీఫ్‌తోపాటు, రబీలో కూడా వరి పండించి ఫలాలు అనుభవిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి కాకపోయినా ప్రతి ఏటా పోలవరం కాలువలో చేరిన నీటిని ఇంజన్ల సహాయంతో ఉపయోగించి సుమారు 5 వేల ఎకరాలు సాగు చేస్తుంటారు.

బాధితులకు మెరుగైన పరిహారం

- అనకాపల్లి-అచ్యుతాపురం రహదారి విస్తరణ నేపథ్యంలో కలెక్టర్ ఫీల్డ్ విజిట్
- నష్టం వాటిల్లే ఇళ్లు, పంట భూముల వివరాల సేకరణ



నాగులాపల్లిలో పర్యటిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

మునగపాక: మండలంలోని నాగులాపల్లి, ఒంపోలు, మునగపాక, తిమ్మరాజుపేట గ్రామాల్లో శుక్రవారం జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పర్యటించారు. అనకాపల్లి హైవే నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల రహదారిని 100 అడుగుల మేర విస్తరించనున్న నేపథ్యంలో ఆయన ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. రహదారి విస్తరణ వల్ల ఎంతమేర ఇళ్లు, పంట భూములకు నష్టం జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట బ్రిడ్జిలు నిర్మించే అంశంపై అధికారుల నుంచి వివరాలు సేకరించారు. బాధితుల నమోదుకు సంబంధించి రికార్డు పక్కాగా ఉండాలని, బాధితులకు మెరుగైన పరిహారం అందేలా చూడాలని సూచించారు. గ్రామాల వారీగా ప్రభుత్వం అందించే సాయం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ, డీటీ వినయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఒకే రోజు 10,769 ధ్రువపత్రాల జారీ

తుమ్మపాల: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు అనూహ్యమైన సేవలు అందిస్తోంది. నాలుగుసార్లు తిరిగితే గానీ లభించని ధ్రువపత్రాలు సునాయాసంగా లభిస్తున్నాయి. దీంతో లబ్ధిదారుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటికే వచ్చి సర్టిఫికెట్లు అందించడంతో జనం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో శుక్రవారం ఒక్క రోజే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 10,769 సర్టిఫికెట్లు అందజేసినట్లు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని, ప్రయోజనం పొందాలని కోరారు.

భూములు ఇచ్చిన వారికి నెల రోజుల్లో రిజిస్ట్రేషన్



జగనన్న సురక్ష సమావేశంలో ధ్రువపత్రం అందిస్తున్నమంత్రి అమర్‌నాథ్

- సురక్ష కార్యక్రమంతో ప్రజల ఇంటికే ప్రభుత్వ సేవలు
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖల మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: మామిడిపాలెం గ్రామంలో జగనన్న కాలనీ కోసం భూములు ఇచ్చిన వారికి.. అందుకు బదులుగా ఇచ్చిన స్థలాల రిజిస్ట్రేషన్ నెల రోజుల్లో పూర్తి చేస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. మామిడిపాలెం గ్రామంలో 1539 మంది వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, అందులో రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు, ఆధార్ మార్పులు చేర్పుల కోసం 1350 దరఖాస్తులు అందినట్టు చెప్పారు. 350 సర్టిఫికెట్లను వెనువెంటనే జారీ చేసినట్లు పేర్కొన్నారు. గతంలో ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలంటే సర్వీస్‌చార్జీలు వసూలు చేసేవారని, కనీసం వారం రోజుల నుంచి నెల రోజులపాటు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులే ఇంటికి వచ్చి ప్రజలకు కావలసిన ధ్రువపత్రాలను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు నాడు-నేడు పథకంలో పాఠశాలలను అభివృద్ధి చేసి, వెల్‌నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిన ఘనత జగనన్న ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడారు.

ఇంటి వద్దకే ధ్రువపత్రాలు

- అర్హత ఉన్న ఏ ఒక్క కుటుంబం సంక్షేమ పథకాలు నష్టపోకూడదు
- జగనన్న సురక్ష కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

చీడికాడ: ఎటువంటి ఖర్చు లేకుండా ఇంటి వద్దకే ధ్రువపత్రాలు అందించే బృహత్తర కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పేరిట చేపట్టారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. శుక్రవారం చీడికాడ కల్యాణ మండపంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి.. ఏ ఒక్క కుటుంబం చిన్న చిన్న సాంకేతిక లోపాలతో సంక్షేమ పథకాలు కోల్పోకూడదన్న లక్ష్యంతోనే జగనన్న సురక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన 11 రకాల సమస్యలకు సంబంధించిన ధ్రువపత్రాల జారీని ఆయన పరిశీలించారు. ఏ ఒక్కరూ నష్టపోకూడదని ప్రతి ఇంటికీ గృహసారథి, వలంటీర్‌ను పంపించి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. సమస్యను తెలుసుకుని వెంటనే వారికి అవసరమైన ధ్రువపత్రాల వివరాలు సేకరించి పరిష్కరించాలన్నారు. పలువురు లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారద, తహసీల్దార్ బి.వి.రాణి, ఎంపీడీవో జయప్రకాష్, మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు ధ్రువపత్రం అందిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ రామ్మూర్తి


రోగి బంధువుతో మాట్లాడుతున్న రామ్మూర్తి

అనకాపల్లి టౌన్: వివిధ రకాల వ్యాధులతో ఆస్పత్రికి వచ్చే గ్రామీణ రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ జి.రామ్మూర్తి తెలిపారు. స్థానిక వైద్యాలయంలో వివిధ విభాగాలను శుక్రవారం రాత్రి ఆయన సందర్శించారు. అక్కడ రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. బడుగు, బలహీన వర్గాల రోగులు మాత్రమే ఆస్పత్రికి వైద్య కోసం వస్తారని, అటువంటి వారికి సకాలంలో వైద్య సేవ లందించి, వారి మన్ననలను పొంది, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. రోగులకు కావల్సిన అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పించామన్నారు. కార్యక్రమంలో వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, వైద్యుడు జి.కృష్ణ, అభివృద్ధి కమిటీ సభ్యులు మునూరు శ్రీను, ఎ.వి.రత్నకుమారి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- జంగారెడ్డిగూడెం నుంచి విశాఖ వెళ్తుండగా ప్రమాదం
- 30 మంది ప్రయాణికుల్లో నలుగురికి గాయాలు
- కశింకోట ఆర్‌ఈసీఎస్ వద్ద ఘటన


కశింకోట వద్ద రోడ్డు పక్కన బోల్తాపడిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు

కశింకోట: స్థానిక ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయం వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరు మహిళలు, మరో ప్రయాణికుడు, బస్సు డ్రైవర్ ఉన్నారు. ఎస్‌ఐ ఎ. ఆదినారాయణరెడ్డి వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు అక్కడి నుంచి విశాఖపట్నం వస్తోంది. ఈ క్రమంలో స్థానిక ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయం వద్ద ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న పల్లపు ప్రాంతంలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం అంటిపేట గ్రామానికి చెందిన బక్కు గౌరీశ్వరి, విజయనగరం జిల్లా మెంటాడ మండలం పెదసామాలపల్లి గ్రామానికి చెందిన జరజాపు సావిత్రి, జంగారెడ్డిగూడెంకు చెందిన కేతిరెడ్డి సత్యనారాయణ గాయపడ్డారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో డ్రైవర్ బుక్కా శ్రీనివాసరావు బస్సు కేబిన్‌లో చిక్కుకోవడంతో స్థానికులు బయటకు తీశారు. క్షతగాత్రులను హైవే పోలీసుల సహాయంతో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం స్వల్ప గాయాలు కావడంతో తమ గమ్యస్థానాలకు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. సురక్షితంగా బయటపడిన 26 మందిని వేరే బస్సులో గమ్యాలకు తరలించారు. బస్సు ముందు భాగం దెబ్బతింది. అద్దాలు పూర్తిగా పగిలిపోయాయి. దాన్ని క్రేన్ సహాయంతో స్థానిక ఆర్టీసీ బస్సు స్టేషన్‌కు తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


గాయపడిన జరజాపు సావిత్రి

ఆస్తి తగాదాలో అన్నపై తమ్ముడు దాడి

మునగపాక: ఆస్తి తగాదాల్లో భాగంగా ఏర్పడిన వివాదంతో అన్నపై తమ్ముడు దాడి చేసిన సంఘటన మండలంలోని రాజుపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన మొగలపల్లి నారాయణరావు పెద్ద కుమారుడు నానాజీ విశాఖలో ఉండగా, చిన్న కుమారుడు వెంకటరమణ స్వగ్రామంలోనే ఉంటున్నాడు. గురువారం తన తండ్రిని చిన్న కొడుకు ఇంటిలో నుంచి పంపించేశాడు. ఈ విషయం తెలుసుకున్న పెద్ద కుమారుడు శుక్రవారం గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టాడు. ఇదే సందర్భంలో అన్నదమ్ముల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో అన్నయ్యపై తమ్ముడు కత్తితో చేతిపై దాడి చేశాడు. నానాజీకి గాయం కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మునగపాక ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న సురక్షతో ప్రజల మన్ననలు

రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక విభాగం క్రియేటివ్ హెడ్ జోగినాయుడు


మాట్లాడుతున్న రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక విభాగం క్రియేటివ్ హెడ్ జోగినాయుడు

నాతవరం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు నేరుగా మేలు చేకూరుస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మరింత ఆదరణ పెరుగుతుందని రాష్ట్ర సృజన్మాతకత, సాంస్కృతిక విభాగం క్రియేటివ్ హెడ్ ఎల్. జోగినాయుడు తెలిపారు. మండలంలోని గునుపూడి గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జోగినాయుడు మాట్లాడుతూ మండల కేంద్రాలకు ప్రజలు వెళ్లకుండానే గ్రామ స్థాయిలోనే అన్ని రకాల సేవలు సచివాలయాల ద్వారా అందిస్తున్నారన్నారు. ఇంకా ఎక్కడైనా సంక్షేమ పథకం అందకపోతే సురక్ష కార్యక్రమం ద్వారా మేలు చేస్తున్నారన్నారు. ఈ విధమైన సేవలు దేశంలో ఎక్కడా లేవన్నారు. వీటిని గుర్తించి ప్రజలు మరలా అత్యధిక మెజార్టీతో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టడం ఖాయమన్నారు. స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌ను మరలా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి జి.వి. లక్ష్మి, తహసీల్దారులతో కలిసి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జోగినాయుడును ఘనంగా సత్కరించారు. వైస్ ఎంపీపీ పైల సునీల్, సర్పంచ్ వేముల సూర్యనారాయణమూర్తి, ఎంపీటీసీ పోలుపర్తి వెంకటరమణ, ఎస్.బి.పట్నం సర్పంచ్ ఎల్. సత్యనారాయణ, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు పోలుపర్తి చిట్టిబ్బాయి, వేముల సూరిబాబు, ఏఎంసీ డైరెక్టరు అడిగర్ల నాయుడు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చినబాబు పాల్గొన్నారు.

13, 14న పీడీఎస్ బియ్యం వేలం

తుమ్మపాల: జిల్లాలో వివిధ 6ఏ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 132.49 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని వేలం ద్వారా విక్రయించనున్నట్లు అనకాపల్లి, చోడవరం తహసీల్దార్లు పీవీఎల్ఎన్ గంగాధరరావు, తిరుమలబాబు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. చోడవరం ఎంఎల్ఎస్ పాయింట్‌లో భద్రపరచిన 34.495 క్వింటాళ్ల బియ్యానికి ఈ నెల 13న, అనకాపల్లిలో 98 క్వింటాళ్ల బియ్యానికి ఈ నెల 14న వేలం ద్వారా విక్రయిస్తామన్నారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనవచ్చన్నారు.

మరింత సమాచారం కోసం ఉప తహసీల్దార్(పౌర సరఫరాలు) అనకాపల్లి ఫోన్ 9293508767, చోడవరం ఫోన్ నంబరు 9618784301 ద్వారా తెలుసుకోవాలన్నారు.

లాలం భాస్కరరావుకు అంతిమ వీడ్కోలు

రాంబిల్లి: మాజీ ఎంపీపీ లాలం భాస్కరరావు అంత్యక్రియలను శుక్రవారం ఆయన స్వగ్రామం లాలంకోడూరులో శుక్రవారం అశ్రునయనాల మధ్య నిర్వహించారు. మాజీ హోం మంత్రి చినరాజప్ప, విశాఖ నార్త్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావుతోపాటు పెద్ద ఎత్తున లాలం అభిమానులు తరలి వచ్చి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. భాస్కరరావుతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.


లాలంకోడూరులో లాలం భాస్కరరావు అంతిమయాత్ర

ఉన్నత విద్యకు అర్హత సాధించేలా బోధన

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ, జేసీ జాహ్నవి

తుమ్మపాల: కళాశాలలో విద్యా ప్రమాణాలు మరింత పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం మోడల్ పాఠశాలలు, కళాశాలల విద్యా ప్రమాణాలు, జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విద్యా సంస్థల నుంచి విద్యార్థులు సాధించిన ర్యాంకులు, ఇంజినీరింగ్, ఎంబీబీఎస్, ఐఐటీ, ఏఐటీ, జేఎన్టీయూ వంటి వాటికి అర్హత పొందిన వారి వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఉన్నత ప్రమాణాలతో శాస్త్ర, సాంకేతిక విద్య బోధించేందుకు నిష్ణాతులైన లెక్చరర్లతో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలన్నారు. ప్రతి వారం పరీక్షలు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యం పెంచే విధంగా అంశాలను రూపొందించాలన్నారు. ఈ విషయమై ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసి ఎక్కువ మంది ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ వంటి ఉన్నత విద్యకు అర్హత సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. జిల్లాలో ప్రతి మండలంలోనూ పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ హక్కుల ఉల్లంఘన కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు కేసుల పరిష్కారం, కొత్తగా నమోదైన కేసులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో నిఘా ఏర్పాటు చేసి ఎస్సీ, ఎస్టీల హక్కుల ఉల్లంఘన జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రీరెడ్డి, డీఆర్వో పి.వెంకటరమణ, జేసీ ఎం.జాహ్నవి, ఆర్ఐవో సుజాత, డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఎస్సీ, బీసీ వెల్ఫేర్ డీడీలు అజయ్‌బాబు, రాజేశ్వరి, ఏటీడబ్ల్యూవో నాగశిరీషా, వివిధ శాఖ జిల్లా అధికారులు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో రెండు గొర్రెల మృతి


మృతి చెందిన గొర్రె వద్ద రైతు

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది మేజర్ పంచాయతీలో వీధి కుక్కలు వీరంగం చేశాయి. శుక్రవారం ఇక్కడ పలు వీధుల్లో గొర్రెలు, మేకల మందలపై దాడి చేశాయి. దీంతో పెంపకందారులు యలమంచిలి రమణ, శింగంపల్లి అప్పారావులకు చెందిన చెరొక గొర్రె మృతి చెందగా, పలు గొర్రెలు గాయపడ్డాయి. రూ. 20 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోతున్నారు. గతంలోనూ పలు మార్లు దాడి చేసి జీవాలను చంపేశాయని, వీధి కుక్కల నిర్మూలనకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బ్లూఫ్లాగ్ బీచ్‌కు బృహత్తర ప్రణాళిక

- అంతర్జాతీయ సౌకర్యాలతో అదనపు హంగులు
- రూ.2.50 కోట్లతో మౌలిక సదుపాయాలు
- బీచ్ వాలీబాల్, బీచ్ క్రికెట్ కోర్టులు, అడ్వెంచర్ స్పోర్ట్స్
- దేశంలోని మిగిలిన బ్లూఫ్లాగ్ బీచ్‌ల మాదిరిగా ప్రవేశ రుసుం
- ఈ నెల 11 నుంచి అమలు చేయాలని కమిటీ నిర్ణయం
- ఒక్కొక్కరికి ప్రవేశ టికెట్ రూ.20
- రూ.10 మరుగుదొడ్ల రుసుం రద్దు


బ్లూ ఫ్లాగ్

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో బ్లూఫ్లాగ్ గుర్తింపు పొందిన ఏకైక బీచ్ రుషికొండ.. మరిన్ని హంగులద్దుకునేందుకు ముస్తాబవుతోంది. పర్యాటకులకు సరికొత్త అనుభూతులు అందించేందుకు రూ.2.50కోట్లతో పర్యాటక శాఖ బృహత్తర ప్రణాళిక సిద్ధం చేసింది. మరోవైపు బీచ్ నిర్వహణకు అవసరమైన నిధుల సమీకరణకు దేశంలోనే ఉన్న మిగిలిన బ్లూఫ్లాగ్ బీచ్‌ల మాదిరిగా నామమాత్రపు ప్రవేశ రుసుం వసూలు చేయాలని నిర్ణయించింది. బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్ వచ్చిన మొదటి ఏడాదిలోనే అన్ని బీచ్‌ల్లో ఎంట్రన్స్ ఫీజు వసూళ్లు చేస్తున్నారు. కానీ రుషికొండ బీచ్‌లో మాత్రం మూడేళ్ల తర్వాత.. ప్రవేశ రుసుం వసూలు చేయాలని నిర్ణయించడం విశేషం.

పరిశుభ్రంగా.. సర్వాంగ సుందరంగా ఉండే బీచ్‌లకు అంతర్జాతీయంగా గుర్తింపు వచ్చే బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్‌ను రాష్ట్రంలో దక్కించుకున్న మొట్టమొదటి బీచ్ రుషికొండ. ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్(ఎఫ్ఈఈ) అనే డానిష్‌కు చెందిన సంస్థ మూడేళ్లుగా ఈ సర్టిఫికెట్ జారీ చేస్తోంది. ఈ నేపథ్యంలో బీచ్‌కు అదనపు హంగులు అద్దుతూ.. విదేశీ పర్యాటకులను సైతం ఆకర్షించేలా ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్(ఏపీయూఐఏఎంఎల్) ప్రణాళికలు రూపొందించింది. 27,400 చ.మీ.విస్తీర్ణంలో రూ.2.50 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేపట్టనున్నారు. టెండర్లు ఖరారు అయిన ఆరు నెలల్లోగా కొత్త సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం సౌర విద్యుత్, పర్యావరణ విద్య, బెంచీలు, స్నానం చేయడానికి వీలుగా షవర్స్, బయో టాయిలెట్లు, గ్రే వాటర్ ట్రీట్‌మెంట్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్, ఆర్వో ప్లాంట్ వంటి సౌకర్యాలు ఉండగా.. కొత్తగా మరిన్ని సౌకర్యాలు తీసుకురానున్నారు. అవేంటంటే..

- పర్యాటకులు నడిచి వెళ్లేందుకు 182 మీ.పొడవుతో 620 చ.మీ విస్తీర్ణంలో ప్రీకాస్ట్ కాంక్రీట్ బ్లాకులతో పాత్‌వే నిర్మించనున్నారు. 3700 చ.మీ విస్తీర్ణంలో పార్కింగ్ డ్రైవ్ వే ఏర్పాటు కానుంది.
- సందర్శకుల రక్షణ కోసం బొల్లార్డ్, బూమ్ బారియర్స్ ఏర్పాటు చేయనున్నారు.
- బీచ్‌ను ఆకతాయిలు అపరిశుభ్రంగా చేయకుండా.. 1620 చ.మీ విస్తీర్ణంలో రక్షణ వలయం ఏర్పాటు చేయనున్నారు.
- 254 చ.మీ విస్తీర్ణంలో బీచ్ చుట్టూ సందర్శకులను ఆకట్టుకునేలా పెయింటింగ్స్ వేయనున్నారు.
- సాగరతీరంలో ఫుట్‌బాల్, క్రికెట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.
- బీచ్ వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేయనున్నారు.

పదేళ్లలోపు చిన్నారులకు ఉచితం

దేశ వ్యాప్తంగా 12 బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ బీచ్‌లున్నాయి. ఈ బీచ్‌ల నిర్వహణకు భారీగా వ్యయం అవుతోంది. అందుకే ప్రతీ బ్లూ ఫ్లాగ్ బీచ్‌లోకి వచ్చే సందర్శకుల నుంచి ప్రవేశ రుసుంలు వసూలు చేస్తున్నారు. ఒడిశాలోని గోల్డెన్ బీచ్, తమిళనాడులోని కోవలం బీచ్, కేరళలోని కప్పడ్ బీచ్, కర్ణాటకలోని కాసర్కోడ్ బీచ్‌ల్లో ఏడాదిన్నర నుంచే ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. కొన్ని బీచ్‌లు రూ.50 ప్రవేశ టికెట్ వసూలు చేస్తుండగా.. మరికొన్ని బీచ్‌లు రూ.20 వసూలు చేస్తున్నాయి. ఈ ఆదాయంతో బీచ్‌లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆ బీచ్‌ల మాదిరిగానే.. ప్రజలకు మరిన్ని సౌకర్యాలు అందించేందుకు రుషికొండ బీచ్‌కు ప్రవేశ రుసుం వసూలు చేయాలని నిర్ణయించారు. బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్ వచ్చిన మూడేళ్ల తర్వాత ఈ ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నారు. పెరుగుతున్న పర్యాటకుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను కల్పించేందుకు ఏపీటీడీసీ ఈ నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి బ్లూఫ్లాగ్ నియమాల్లో ప్రవేశరుసం కూడా ఉంది. దాన్ని కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఇందులో భాగంగా ఈ నెల 11 నుంచి ఒక్కొక్కరికీ రూ.20 చొప్పున వసూలు చేయాలని నిర్ణయించారు. పదేళ్ల లోపు చిన్నారులకు ఉచితంగా ప్రవేశం కల్పించాలని బీచ్ మేనేజ్‌మెంట్ కమిటీ తీర్మానించింది. ప్రస్తుతం బీచ్‌లో టాయిలెట్ల వినియోగానికి రూ.10 వసూలు రద్దు చేశారు.

సందర్శకులకు ఉచిత సౌకర్యాలు

కలెక్టర్ డా.మల్లికార్జున చైర్మన్‌గా వ్యవహరించే బీచ్ మేనేజ్‌మెంట్ కమిటీ.. సందర్శకులకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించింది. స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం, ప్రథమ చికిత్స సదుపాయం, ఫిజికల్ ఫిట్‌నెస్ పరికరాల వినియోగం, చిన్నారుల ఆటస్థలం, స్విమ్మింగ్ జోన్‌లను పూర్తి ఉచితంగా వినియోగించుకోవచ్చు. ప్రస్తుతం ఉన్న పార్కింగ్ ఫీజు, స్నానాల గదుల చార్జీలు యథాతథంగానే కొనసాగుతాయి.

39 మందితో బీచ్ పరిశుభ్రత, భద్రత



రాష్ట్రంలోని ఏకైక బ్లూఫ్లాగ్ బీచ్‌ను అభివృద్ధి చేసుకునేందుకు కమిటీ పలు నిర్ణయాలు తీసుకుంది. దీనికి అందరూ సహకరించాలి. బీచ్ పరిశుభ్రత, సందర్శకుల భద్రత కోసం రూ.6లక్షల వ్యయంతో 39 మంది బీచ్ క్లీనర్లు, సెక్యూరిటీ గార్డులు, లైఫ్ గార్డులను నియమించాం. త్వరలోనే అంతర్జాతీయ సౌకర్యాలు కూడా రాబోతున్నాయి. ఈ నేపథ్యంలో నిర్వహణ వ్యయంతో కోసం.. బ్లూఫ్లాగ్ నియమాలను అనుసరించి ఎంట్రన్స్ ఫీజు వసూలు చేయాలన్న బీచ్ మేనేజ్‌మెంట్ కమిటీ నిర్ణయానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– శ్రీనివాస్ పాణి, ఏపీటీడీసీ రీజనల్ డైరెక్టర్

మాడుగులలో డెంగ్యూ కేసు

మాడుగుల రూరల్: స్థానిక జగ్గన్నచావిడి పరిధిలోని కొబ్బరితోట వీధిలో వృద్ధురాలి(65)కి డెంగ్యూ సోకినట్లు తెలిసింది. ఆమెకు గత నెల 26న జ్వరం రావడంతో స్థానిక సెయింట్‌ఆన్స్ ఆస్పత్రిలో చికిత్స పొందింది. తర్వాత తగ్గకపోవడంతో ఈ నెల 3న విశాఖ కేజీహెచ్‌లో పరీక్షించగా, డెంగ్యూ నిర్ధారణ కావడంతో అక్కడ చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న కె.జె.పురం పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం డెంగ్యూ సోకిన ఆమె ఇంటిని పరిశీలించారు. చుట్టు పక్కల పరిసరాల్లో బ్లీచింగ్ చల్లారు. స్థానికులకు పరిశుభ్రతపై ఎంపీహెచ్‌ఈవో పి.రామారావు, ఆరోగ్య పర్యవేక్షకుడు వెంకట్రావు, సహాయకుడు శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు అవగాహన కల్పించారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఆయా స్టేషన్లలో శుక్రవారం పలు రైళ్లు ఆలస్యంగా బయలుదేరాయని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. చెన్నై సెంట్రల్‌లో రాత్రి 7.20 గంటలకు బయలుదేరాల్సిన చెన్నై సెంట్రల్-హౌరా(12840) మెయిల్ ఎక్స్‌ప్రెస్ సుమారు రెండు గంటలు ఆలస్యంగా రాత్రి 9.30 గంటలకు బయలుదేరింది. హౌరాలో రాత్రి 11.55 గంటలకు బయలుదేరాల్సిన హౌరా-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(12839) మెయిల్ ఎక్స్‌ప్రెస్ సుమారు నాలుగు గంటలు ఆలస్యంగా శనివారం తెల్లవారుజాము 4 గంటలకు బయలుదేరింది.

దారి మళ్లింపు

ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో సంభవించిన అగ్ని ప్రమాదం దృష్ట్యా శుక్రవారం విశాఖపట్నంలో బయలుదేరిన విశాఖపట్నం-లింగంపల్లి(12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్‌లో బయలుదేరిన సికింద్రాబాద్-హౌరా(12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లను దారి మళ్లించారు. ఈ రైళ్లు రెగ్యులర్ మార్గంలో కాకుండా విజయవాడ, కాజీపేట మీదుగా నడిచాయి.

ఆదాయానికి మించిన ఆస్తి కేసులో జైలు శిక్ష

విశాఖ లీగల్: ఆదాయానికి మించి ఆస్తి కలిగి ఉన్న పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగికి మూడేళ్ల జైలుశిక్ష, రూ 2లక్షలు జరిమాన విధిస్తూ నగరంలోని అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం తీర్పునిచ్చింది. ఏసీబీ అధికారులు అందించిన వివరాలిలా ఉన్నాయి. నిందితుడు ఏ.ఎస్. హరి గతంలో పంచాయతీ రాజ్ విభాగంలో ఉద్యోగిగా పనిచేశారు. 1997లో అతనిపై ఏసీబీ అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

క్లుప్తంగా

అభినందన సత్కారం



కాశీనందీశ్వరరావుని సత్కరిస్తున్న యూనియన్ సభ్యులు

అనకాపల్లిటౌన్ : స్థానిక ఆచార్య ఎస్.జి.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీకి చెందిన కొణతాల కాశీనందీశ్వరరావు ఈ నెల 2, 3 తేదీల్లో ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఉద్యోగుల జాతీయ మహాసభల్లో ఎంప్లాయీస్ సమాఖ్య ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్ఏఆర్ఎస్ ఉద్యోగులు ఆయన్ని శుక్రవారం సత్కరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని కాశీనందీశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు సీహెచ్ బాబు, పి.మురళి, ఎస్.పద్మ, కోటేశ్వరరావు, సూరినాయుడు, ఎ.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా నాయుడు

అనకాపల్లిటౌన్: అనకాపల్లి రోటరీ క్లబ్ (2023–24) అధ్యక్షుడిగా పీజే నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక న్యూకాలనీ పాలూరి చిదంబరం రోటరీ హాల్లో గురువారం రాత్రి జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా ఆడారి రామకృష్ణ, కోశాధికారిగా రాపేటి నారాయణరావుతో పాటు మరో 14మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్టు పీజే నాయుడు శుక్రవారం తెలిపారు.

కుక్కలు, కోతుల బెడదపై ఎంపీకి వినతి



ఎంపీ సత్యవతికి వినతిపత్రం అందిస్తున్న బొడ్డేడ అప్పారావు

అనకాపల్లిటౌన్: కుక్కలు, కోతులను నివారించాలంటూ నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జిల్లా గౌరవాధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు ఎంపీ సత్యవతిని కలిసి శుక్రవారం వినతిపత్రం అందించారు. జిల్లాలో పలు చోట్ల కోతుల కారణంగా వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లుతోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆయన వెంట ఫోరం జిల్లా అధ్యక్షుడు కొల్లి చిన అప్పారావు, ప్రధాన కార్యదర్శి సూదికొండ మాణిక్యాలరావు, ఉపాధ్యక్షులు కట్టమూరి మంగరాజు, పెట్ల నాగేశ్వరరావు, చెవ్వేటి అప్పారావు, నాగరాజు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

రుద్రంగి	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
ఇద్దరు	: సత్యనారాయణ స్క్రీన్-2
ఈ నగరానికి ఏమైంది? (మార్నింగ్,మ్యాట్నీ)	
రంగబలి	: షిర్డిసాయి
అశ్విన్స్	: పర్తిసాయి
ఇన్ఫిడియస్ ద రెడ్ డోర్	: వెంకటేశ్వర
భాగ్ సాలే	: శ్రీసత్య
సామజవరగమన	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 162 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	----	----
రెండో రకం	4,050	4,500
మూడోరకం	4,000	4,000

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 82 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-38 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-27 యూనిట్లు, ఓ నెగిటివ్-4 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 331 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 296 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

కప్పాకప్పా నీలాలు.. కురవాలి వర్షాలు



కప్పాకప్పా నీలాలంటూ కప్పతో ఊరేగింపు

- తొలకరి కోసం పల్లెల్లో కప్పలకు పూజలు
- మెట్ట ప్రాంతాల్లో ఆలస్యమవుతున్న వరినాట్లు
- సాధారణ సాగులో ఇప్పటి వరకు 1 శాతం భూమిలోనే నాట్లు

తుమ్మపాల: వరుణుడి కరుణ కోసం రైతులు కప్పలకు పూజలు చేస్తున్నారు. ఇప్పటికే ముమ్మర వర్షాలు కురిసి నాట్లు వేసుకుంటూ తీరిక లేకుండా రైతులు పొలాలకే పరిమితం కావాల్సిన సమయం. అయితే ఈ ఏడాది ఇంకా ఆశించిన స్థాయి వర్షాల్లేవు. దీంతో పల్లెల్లో వానదేవుడికి కప్పాకప్పా నీలాలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మండలంలోని కొండుపాలెం, పాపయ్యపాలెం, పాపయ్యసంతపాలెం, మామిడిపాలెం గ్రామాల్లో గత పది రోజులుగా ఈ సందడి కొనసాగుతోంది.

కప్పకు ఊరేగింపు పూజ

కప్పాకప్పా నీలాలు కార్యక్రమం నిర్వహిస్తే వరుణుడు కరుణించి, వర్షాలు కురిపిస్తాడని అనాది నుంచి రైతుల నమ్మకం. ఈ సంప్రదాయంలో భాగంగా ఒక కర్రకు కప్పను కట్టి కప్పపై నీళ్లు పోస్తూ కప్పా కప్పా నీలాలు.. వానలు కురవాలి.. చెరువులు నిండాలి.. అని పాడుకుంటూ ఊరంతా ఊరేగిస్తారు. ఈ ఊరేగింపులో రైతు కుటుంబాల నుంచి బియ్యం, పప్పులు జోగి దండుతారు. అనంతరం గ్రామాల్లో దేవాలయాల వద్ద అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారు. జోగి ద్వారా సేకరించిన బియ్యం, పప్పులతో ప్రసాదం తయారుచేసి గ్రామంలో ఉన్న దేవుకి తొలుత నైవేద్యంగా సమర్పించి, అనంతరం గ్రామం లో అందరు కలిసి ప్రసాదంగా స్వీకరిస్తారు.

జాడలేని తొలకరి

ఈ ఏడాది రుతుపవనాలు కాస్త ఆలస్యంగానైనా రాష్ట్రంలో ప్రవేశించాయి. అయినా తొలకరి వానలకు రైతుల ఎదురుచూపులు తప్పట్లేదు. సాధారణంగా జూన్ మొదటి వారంలోనే రుతుపవనాల ప్రవేశంతో చెదురుమదురు వానలు కురవడం పరిపాటి. వాటితో దుక్కులు దున్ని, నారుమడులు, ఎదజల్లడం తదితర కార్యక్రమాల్లో రైతులు తలమునకలై ఉంటారు. ఈసారి వరినాట్లకు సరిపడా వర్షం కురవలేదని మెట్టప్రాంత రైతులు చెప్తున్నారు. మండలంలో వరి సాధారణ సాగు సుమారు 7,200 కాగా, ఇప్పటి వరకు కేవలం 100 ఎకరాల్లోపే విత్తనాలు జల్లినట్టు మండల వ్యవసాయాధికారి పీయూబీపీ రంగాచారి తెలిపారు. జూన్‌లోనే నాట్లు మొదలవ్వాల్సి ఉందని, వర్షాభావ పరిస్థితుల వల్ల ఆలస్యమవుతోందన్నారు. పూర్తి స్థాయిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేసినట్టు తెలిపారు.

రుతుపవనాలు ప్రవేశించినా ఆశించిన మేర తొలకరి పలకరింపుల్లేవు. దీంతో రైతులు దిగాలుగా ఆకాశం వేపు చూస్తున్నారు. పల్లపు భూముల్లో జలాశయాల కింద కొంత మేర నారుమడులు సిద్ధమవుతున్నాయి. మెట్ట ప్రాంత ప్రజలు దుక్కులు దున్ని, పొలాల్ని సిద్ధం చేశారు. వరుణ దేవుడి కరుణ కోసం కప్పాకప్పా నీలాలు.. కురవాలి వర్షాలంటూ.. సంప్రదాయ పూజలు చేస్తున్నారు.

కప్పకప్ప నీలాలాడితే వర్షం కురుస్తుంది



మృగశిర కార్తి వచ్చేసింది కానీ.. వర్షం మాత్రం కురవడం లేదు. దీంతో పొలాల్లో వరి నాట్లు, గంట్లు, రాగులకు విత్తనాలు వేయలేకపోతున్నాము. ఆచారంగా వస్తున్న కప్పకప్ప నీలాలు చేపట్టాం. ప్రసాదం చేసి దేవుళ్లకు నైవేద్యం పెట్టి, సహపంక్తి భోజనాలు చేస్తే వర్షాలు కురుస్తాయని నమ్మకం.

– మధుపాడ రమణమ్మ, కొండుపాలెం

ఈ ఏడాది వర్షాలు బాగా ఆలస్యం



ప్రతి ఏటా ఈ పాటికే వర్షాలు కురిసి వరి నాట్లు పూర్తి చేసేవాళ్లం. ఈసారి పొలాలు ఎండిపోయి బీటలు వారాయి. వరి నాట్లకు ఆకుమడులు సిద్ధంగా ఉన్నప్పటికీ వరుణ దేవుడి కరుణ కోసం ఆశగా ఆకాశం వైపు చూస్తున్నాం. కప్పాకప్పా నీలాలతో వర్షాలు కురవాలని ప్రార్థిస్తున్నాం.

–సేనాపతి ఈశ్వరరావు, రైతు, చేనుల అగ్రహారం

వర్షాలు పడి చెరువులు నిండుతాయి



పసుపుగుడ్డలో కప్పను పెట్టి కర్రకు కట్టి ఊరంతా కప్ప కప్ప నీలాలాడుతున్నాము. మా గ్రామంలో కొండపై నున్న వీరన్న స్వామి వద్ద పాలు పొంగించి పరమాన్నం వండి, నైవేద్యంగా పెట్టాం. ప్రసాదాన్ని ఊరంతా ఒక చోట కలిసి తిన్నాము. దీంతో వరుణుడు కరుణిస్తాడని నమ్మకం.

– మంత్రి దేముళ్లమ్మ, కొండుపాలెం

జగనన్న పథకాలతో బతుకులు భద్రం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



కేటీవీపాలెం స్కూల్లో తరగతి గదిని పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: సీఎం జగనన్న ప్రవేశపెట్టిన పథకాలతో పేదల జీవితాలు బాగుపడ్డాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఒకప్పుడు గ్రామాల్లోకి వెళ్లే నేతల వద్ద గ్రామస్తులు సమ్యలను ఏకరువు పెట్టుకునేవారని, ప్రస్తుతం తమ ప్రభుత్వ పాలనలో ఆ పరిస్థితి చాలా వరకు తగ్గిందన్నారు. మండలంలోని గొలగాం పంచాయతీ పరిధి కొత్త తలారివానిపాలెం, ఎస్సీ, బీసీ కాలనీల్లో ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందిన ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. వారి సమస్యలను తెలుసుకుని తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానికులు ఇంటింటి కుళాయిలు, డ్రైనేజీలు, రహదారులు నిర్మించాలని మంత్రిని కోరారు. కేటీవీపాలెంలో ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణానికి రూ.11 లక్షలు కేటాయిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామానికి చెందిన బి.దుర్గ ఇద్దరు పిల్లలు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకు రావడంతో మెరుగైన వైద్యం చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించిన డ్రైనేజీని ఆయన ప్రారంభించారు. కొత్త తలారివానిపాలెంలో నాడు-నేడు పథకంలో రూ.17.77 లక్షలతో అభివృద్ధి చేసిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, రూ.15 లక్షలతో నిర్మించనిబోయిన డ్రైనేజీ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడిచిన నాలుగు సంవత్సరాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వలన గ్రామ ప్రజల జీవనశైలి మెరుగుపడిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు 11 రకాలైన సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో గొలగాం సర్పంచ్ శెలపురెడ్డి నరసింగరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మింది అచ్యుతరామ్, సూరి అప్పారావు, ప్రభుత్వశాఖల ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి రైతుల సమస్యలు

తుమ్మపాల గ్రోయిన్ పరిశీలనలో దాడి రత్నాకర్



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న దాడి రత్నాకర్

అనకాపల్లి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి అనకాపల్లి ప్రాంత రైతాంగ సమస్యలను తీసుకెళ్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పార్లమెంటు పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. మండలంలో భారీ వర్షాలు, ఇసుక మాఫియా అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా శిథిలమైన తుమ్మపాల గ్రోయిన్‌ను శుక్రవారం ఆయన ఆ ప్రాంత ఆయకట్టు రైతులతో కలిసి పరిశీలించారు. గ్రోయిన్ వద్ద రివిట్మెంటు, కటాఫ్ వాల్ ధ్వంసమవడానికి నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం కూడా కారణమని ఆరోపించారు. ఇటీవల ఇక్కడ సాగునీటి వనరుల స్థితిని జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే తగు చర్యలు తీసుకోవడానికి నివేదిక ఇవ్వాల్సిందిగా జల వనరుల శాఖ అధికారులను ఆదేశించినా, వారిలో కదలిక లేకపోవడం దారుణమన్నారు. గ్రోయిన్ సమీపంలో ఇసుక అక్రమ తవ్వకాల కారణంగా రివిట్మెంటు కుంగిపోయిందన్నారు. తుమ్మపాల, దిబ్బపాలెం, మార్టూరు, శంకరం, రేబాక గ్రామాలకు చెందిన సుమారు 2,300 ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ గ్రోయిన్‌కు తక్షణమే మరమ్మతులు చేపట్టడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదన్నారు. సీఎం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్టు పేర్కొన్నారు. పర్యటన సందర్భంగా ఆ ప్రాంత రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కొణతాల భాస్కరరావు, బొడ్డపాటి రాజారావు, పాకలపాటి రాజబాబు, పెంటకోట గోవింద్, ఉప సర్పంచ్ దాడి గణేష్ పలువురు రైతులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

అనకాపల్లిటౌన్: స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను శనివారం ఉదయం 9.15 గంటలకు నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీలు విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు.

- మండలంలోని 32 పంచాయతీల పరిధిల్లో వైఎస్సార్ జయంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు గొర్లి సూరిబాబు ఓ ప్రకటనలో తెలిపారు.

కశింకోట: కశింకోటలో శనివారం ఉదయం 9 గంటలకు దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు శుక్రవారం తెలిపారు. కశింకోటలోని ప్రధాన రహదారిలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

ఫ్రైడే డ్రైడేతో దోమల నిర్మూలన



ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో జెడ్పీ వెంకటరమణ

అనకాపల్లిటౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని జెడ్సీ వెంకటరమణ అన్నారు. స్థానిక నర్సింగరావుపేటలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్న సమయంలో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. గృహాల్లో వాడుక నీటిని రెండు మూడు రోజులకు ఓసారి ఖాళీ చేసుకోవాలన్నారు. డెంగ్యూ, మలేరియా కారక దోమల నియంత్రణకు ప్రతి వ్యక్తి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జీవీఎంసీ శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ



డెంగ్యూ నివారణపై అవగాహన కల్పిస్తున్న తుమ్మపాల ఆస్పత్రి సిబ్బంది

అనకాపల్లి రూరల్: ప్రాణాంతక డెంగ్యూపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నుస్రత్ షమీమ్ సూచించారు. డెంగ్యూ నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగ్యూ నివారణకు వైద్య ఆరోగ్యశాఖ అనేక చర్యలు చేపడుతోందన్నారు. దోమల నియంత్రణ ద్వారా డెంగ్యూ వ్యాప్తిని అదుపులో ఉంచవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో డి.శారద, ఎంపీహెచ్‌ఈవో జమ్ము శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఎస్‌లు బి.సంగం, ఎమ్.మాణిక్యాంబిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కమిటీలను నియమించాలి



వినతిపత్రం అందిస్తున్న కొల్లి చినఅప్పారావు

తుమ్మపాల: ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ డివిజన్ కమిటీలను నియమించాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయంలో నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ ప్రతినిధులు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలని ఫోరం జిల్లా అధ్యక్షుడు కొల్లి చినఅప్పారావు, గౌరవ అధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు, ప్రధాన కార్యదర్శి సూదికొండ మాణిక్యాలరావు తెలిపారు. డివిజన్ కమిటీల ఏర్పాటుకు తక్షణమే నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు.

జగనన్న సురక్షతో సత్వర పరిష్కారం



జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి

కశింకోట: జగనన్న సురక్షతో దీర్ఘకాలిక ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని తాళ్లపాలెం-2 సచివాలయం, అచ్చెర్ల సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుల, ఆదాయ, కుటుంబ సభ్యుల ధ్రువపత్రాలు, బియ్యం కార్డులు వగైరా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాళ్లపాలెంలో 261 మందికి కుల, 156 మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, ఎంపీడీవో వి.వి. రవికుమార్, తహసీల్దార్ జి. సత్యనారాయణ, ఏవో ఖాన్, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, నిమ్మదల సోమేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు లగిశెట్టి భవాని, అద్దంకి సతీష్, నిమ్మదల లక్ష్మి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, కార్యదర్శులు వెంకటలక్ష్మి, చిన్నోడు, సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి బీరువా వితరణ



దాత సూర్యకుమారి అందించిన బీరువాను పరిశీలిస్తున్న శకుంతల

కశింకోట: దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వంతో పాటు దాతలు కూడా ప్రోత్సాహం అందివ్వాలని సమ్మిళిత విద్య జిల్లా సమన్వయకర్త శకుంతల కోరారు. కశింకోటలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో దివ్యాంగులకు చెందిన భవిత కేంద్రానికి ఉపాధ్యాయురాలు హెచ్ఎస్ఎస్ సూర్యకుమారి తన భర్త శివకుమార్ జ్ఞాపకార్థం బీరువాను శుక్రవారం సమకూర్చారు. ఈ సందర్భంగా శకుంతల మాట్లాడుతూ దివ్యాంగుల విద్య, ఉపాధికి అందరూ సహకరించాలన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ నిపిడ్ ద్వారా 13 మంది దివ్యాంగులకు రూ.11 వేల విలువైన ఎంఆర్ కిట్లు, రూ.10 వేల విలువైన వీల్‌చైర్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీఎస్ హైస్కూలు హెచ్ఎం ఆచంట రవి, భవిత స్కూల్ ఉపాధ్యాయులు బి.వి.రమణమ్మ, ఎస్.దీప, కె.వెంకటేశ్వరరావు, ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం రామునాయుడు, అంగన్‌వాడీ కార్యకర్తలు సంతోష్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయించండి

దిబ్బపాలెం స్కూల్‌పై కలెక్టర్‌కు దాడి రత్నాకర్ లేఖ



దిబ్బపాలెం ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి రూరల్: దిబ్బపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న నాడు–నేడు పనులను తక్షణమే పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. మండలంలోని దిబ్బపాలెం హైస్కూల్‌లో శుక్రవారం ఆయన రెండో దశ నాడు నేడు పనుల పురోగతిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు కోట్లాది రూపాయలు ఇస్తున్నారన్నారు. దిబ్బపాలెం స్కూల్‌కి నిధులు మంజూరయ్యాయని, అయినా ఇంకా ఫ్యాన్లు అమర్చలేదని, టాయిలెట్లు నిర్మించలేదని, పెయింటింగ్ పనులు పూర్తి చేయలేదని పేర్కొన్నారు. టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేయకపోవడంతో బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే పనులు పూర్తయ్యేలా, టాయిలెట్ల నిర్మాణం వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కలెక్టర్‌ను కోరుతూ లేఖ రాసినట్టు రత్నాకర్ తెలిపారు.

'సురక్ష'లో ఉచితంగా 11 సేవలు

ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి



అప్పారావుకు వివాహ ధ్రువపత్రం అందజేస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి తదితరులు

పరవాడ: మండలంలోని పెదముషిడివాడ, కన్నూరు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన జగన న్న సురక్ష కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పెదముషిడివాడ నుంచి 436, కన్నూరు గ్రామంలో 361 దరఖాస్తులు వచ్చాయి. వాటిని సచివాలయ సిబ్బంది అక్కడికక్కడే సిద్ధం చేసి ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అందరికీ లబ్ధి చేకూరాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులకు 11 సేవలు ఉచితంగా అందించడానికి సర్కారు చర్యలుచేపట్టిందన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలు సంక్షేమ పథకాల కోసం టీడీపీ నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేసేవారని నేడు ఆ పరిస్థితులు లేవన్నారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారుడి తలుపుతట్టి వారికి అవసరమైన సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. కార్యక్రమాల్లో జగనన్న సురక్ష ఇన్‌చార్జి కొటాన రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, సర్పంచ్‌లు గొల్లవిల్లి కృష్ణవేణి, పల్లా అప్పారావు నాగమణి, తహసీల్దారు పి.కనకారావు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఈవోఆర్డీ పద్మజ, పెదముషిడివాడ పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమార్, పార్టీ నాయకులు పైల అప్పలనాయుడు, సూరిబాబు, రెడ్డి శ్రీను, జి.రవి, బుజ్జి పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసంపై ఫిర్యాదు



ధ్వంసమైన శిలాఫలకం

అనకాపల్లిటౌన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మండలంలో కొత్తతలారివానిపాలెంలో రూ.15 లక్షలతో చేపట్టబోయే సీసీ డ్రైనేజీ నిర్మాణ శిలాఫలకాన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమం ముగిసిన తర్వాత మధ్యాహ్నం సుమారు ఒంటిగంట, రెండు గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి కె.కనకబాబు అనకాపల్లి రూరల్ పోలీసులకు శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేశారు. కనకబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సీహెచ్ నరసింగరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి బీసీ రౌండ్ టేబుల్ సమావేశం రేపు



మాట్లాడుతున్న ఆడారి కుమారస్వామి

అనకాపల్లి టౌన్: ఈనెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు విజయ రెసిడెన్సీలో రాష్ట్రస్థాయి బీసీ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బీసీ అసోసియేషన్ ఇన్‌చార్జ్ ఆడారి కుమారస్వామి చెప్పారు. శుక్రవారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీల జనగణన, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు వంటి వాటిపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు.

రైతులకు వరి విత్తనాల పంపిణీ

సబ్బవరం: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తవ్వవానిపాలెం సర్పంచ్ బోకం స్వామినాయుడు అన్నారు. మండలంలోని తవ్వవానిపాలెం రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం రాయితీపై అందించిన వరి విత్తనా లను శుక్రవారం ఆయన రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు,మండల వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ బోకం కాసుబాబు,వైస్ సర్పంచ్ వనం దేముడు బాబు,సచివాలయ కన్వీనర్ డెక్కా దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.